

# ఆత్మీయులు

- వీణా చందర్రావు

"ఆఫీసుకెల్తున్నానత్తయ్యా..." అంటూ వయ్యారంగా గడప దాటింది వసంత. లూటీకి గురైన చేనులాగున్న వంటిల్లు సర్దడంతో సతమతమవుతున్న భారతమ్మ 'సరే... వెళ్లి రామ్మా' అంది లోపల్నుండే.

స్కూటర్ స్టార్ట్ చేసి బయట తన కొరకే ఎదురుచూస్తున్న భర్త వెనుక కూచుని 'పదండి' అంది నాజూగ్గా వసంత.

ఝూమ్మంటూ జెట్ విమానంలా దూసుకుపోయింది స్కూటర్.

భారతమ్మ కొడుకూ, కోడలూ ఇద్దరూ ఉద్యోగస్తులే. పెందరాలే నిద్రలేచి గబగబా వంట పని తెమిలితే నాలుగు మెతుకులు నోట్లో కుక్కుకుని టిఫిన్ బాక్సుల్తో బయల్దేరుతారిద్దరూ. తిరిగి సాయంత్రానికొస్తారు వాడిపోయిన కూరాకుల్లా.

ఐదు నిమిషాలు కాగానే

"అమ్మా... ఏం చేస్తున్నావే...?" అంటూ సరాసరి వంటగదిలోకొచ్చింది కూతురు వాసంతి హడావుడిగా.

"ఏమ్మా... ఆఫీసుకేనా...' ఆప్యాయంగా కాఫీ కప్పు అందించబోయింది.

"టైం లేదమ్మా... బయట మీ అల్లుడు స్కూటరాపి చూస్తున్నాడు. నేనొస్తా..." అంటూ గిరుక్కుమన్న వాసంతి వాలకానికి నివ్వెర బోయింది. కూతురూ అల్లుడూ కూడా ఉద్యోగస్తులే. అదే వీధిలో వుంటారు. ఇద్దరూ ఆఫీసుకెల్తూ రెండేళ్ళ కొడుకు అగ్నివేష్‌ను అవిడ దగ్గర వదిలేసి వెళ్తారు. తిరిగి సాయంత్రం తీసికెళ్తారు.

వాసంతికి పై మనిషిగానీ, పనిమనిషి గానీ లేరు. పాపం! ఇంతెడు చాకిరీ ఒక్కత్తె ఎలా చేసు కుంటుందో! కూతురు పరిస్థితికి జాలేస్తుంది భారతమ్మకు అప్పుడప్పుడు.

వంటిల్లు సర్దడం పూర్తికాలేదింకా. ఆర్నెల్ల మనవరాలు గుక్కపెట్టి ఏడుస్తోంది. కొడుకు కూతురాపాప. గబగబా ఊయల దగ్గరకెల్లింది. మనవడు అగ్నివేష్ ఆ చంటిదాని బుగ్గల మీద కొడుతూ ఆడుతున్నాడు. ఊళ్ళోవాళ్ల నోళ్ళన్నీ తనవేనన్నట్టు అరుస్తుందా చిన్నారి.

"ఒరే బడవనాకా...! అది నీ మరదల్రా. అప్పుడే దాన్ని కొడుతున్నావా?" అంటూ మనవణ్ణి పక్కకు తప్పించి ఊయల ఊపింది. కణకణమండే నిప్పుల మీద నీల్లు జల్లినట్టుందావిడ మనసుకు- ఇంటి కప్పెగిరిపోయేలా ఏడుస్తున్న పాప చప్పున ఊరుకుని నిద్రలోకి జారుకుంది.

అగ్నివేష్‌ను తీసుకుని మళ్ళీ వంటింట్లోకెళ్లింది.

కాలేజికెళ్ళిన నాటికీ, ఆఫీసుకెల్తున్న నాటికీ ఎంత తేడా వాసంతిలో... అటున్న పుల్ల ఇటు పెట్టని కూతురు... మరిప్పుడో...! ఇంతెడు చాకిరీ చేసుకుంటూ, పిల్లలకూ, భర్తకూ ఏ లోటూ రాకుండా చూసుకుంటుంది. ఉద్యోగం కూడా చేస్తుంది.

ఐనా... అల్లుడు వాళ్ళమ్మను రప్పించుకుంటే బావుండేదేమో! వాసంతికి సాయంగానూ వుండేది... తనకీ హైరానా కాస్త తగ్గేది. అల్లుకు పోతున్న ఆలోచనల్తో గ్యాసు పొయ్యి తుడుస్తుంటే 'ధభీ' మన్న శబ్దం వినిపించింది వెనకనుంచి.

గద్దె మీంచి మంచినీళ్ళ బిందెను నెట్టేసి కిలకిలా నవ్వుతున్నాడు అగ్నివేష్. ఇంతకుముందే తుడిచిన వంటిల్లు నీటితో నిండిపోయింది. నెత్తీ నోరు కొట్టుకోవాలనిపించింది.

వాడి చెంప మీద ఒక్కటంటించాలనిపించింది. కాని వాడు వాళ్ళమ్మతో చెబితే ఏమనుకుంటుందో!

వసారాలోకి తీసుకొచ్చి వాడికో చాక్లెట్ ఇచ్చింది. తింటూ కూచొమ్మని. వాడలాగే చేస్తా నన్నాడు తలాడించి.

కొత్త బిందె... చొట్టబోయి దిక్కులేని దానిలా పడుంది. బిందె లేవనెత్తుతూంటే అదోలాగన్పించింది.

కొడుకూ, కోడలు దెబ్బలాడుకుని రెండొందలు పోసి కొనుక్కొచ్చిన బిందె... వారం రోజులు కూడా కాలేదు.

నీళ్ళన్నీ తుడిచేసరికి గంటపైనే పైంది. కాళ్ళూ చేతులూ పీకుతున్నాయిప్పటికే. వరాలు మొరాయిస్తున్నాయి. చేతులు తుడుచుకుంటూ బయటి కొచ్చింది. మూతిని మూడు ముళ్ళు బిగించి అలిగి కూచున్నాడు అగ్నివేష్- చాక్లెట్ అయిపోయిందని.

వాడిని ప్రసన్నం చేసుకోవాలని ప్రయత్నిస్తుంటే బయట ఐస్క్రీం అమ్ముతున్న కుర్రాడి వైపు వేలుబెట్టి చూపించాడు. మూతి ముడి తిప్పకుండా. ఐస్క్రీం కొనివ్వగానే వాడి మొహం ముద్దబంతి పూవులా విచ్చుకుంది.

వంటింట్లో ఎలుకల దండు బియ్యండబ్బా మూత ఊడదీసే ప్రయత్నంలో ఘోరంగా విఫలమై ద్విగిణీకృతోత్సాహంతో విజృంభించాయి. అమాంతం డబ్బాను కిందికి నెట్టెయ్యడంలో ఘన విజయం సాధించాయి. ధమ్మన్న పెద్ద శబ్దం విని పరుగెత్తిందటు. బియ్యం చెల్లాచెదురై వంటిల్లంతా నిండాయి. పారిపోతున్న ఎలుకల్ని చీరెయ్యాలన్నంత కోపమొచ్చింది. కీర్తిశేషుడైన భర్త శేషగిరి రూపం కళ్ళల్లో కదలాడింది.

"ఒకే కొడుకు, ఒకే కూతురు మనమదృష్ట వంతులం భారతీ!"

"ఔనండీ... వీళ్ళిద్దర్నీ చదివించి పెళ్ళిళ్ళు ఒకేసారి చేసేస్తే... కూతురు అత్తారింటికెళ్తుంది. కోడలు మనింటికొస్తుంది. మన శేష జీవితం హాయిగా గడుస్తుంది..."

కళ్ళు తడై... బిందు రూపం దాల్చి... కనుకొలుకుల్లోంచి రెండశ్రుబిందువుల్ని రాల్చి కపోలాల్ని తడిపేశాయి. బియ్యం డబ్బాలోకేత్తేసరికి తల ప్రాణం తోకకొచ్చింది. ఉయ్యాల్లోంచి చంటిది కేర్‌మంది. సీసాలో పాలు బోసి నోటికందించే సరికి రైలింజను కూతాగినట్టయింది. కొడుకు పెద్ద కూతురూ, కూతురు పెద్ద కొడుకూ మధ్యాహ్నం భోజనాలకొచ్చారు. వాళ్ళ భోజనాలై తిరిగి బడికెళ్ళిన తరువాత కంచాలు కడిగేసరికి రెండున్నరైంది.

కాస్సేపు నడుం వాల్చుదామనేసరికి చంటిది ఏడుపులంకించుకుంది. అగ్నివేష్ చేతిలో దినపత్రిక ముక్కముక్కలైంది.

మనవరాలినెత్తుకుని లాలించింది. పేపరు ముక్కలు ఊద్చేస్తూ.

రోజూ ఇదే తంతు. ఉదయం నిద్రలేచిన్నుంచీ రాత్రి పడుకునే దాకా ఇదే బాగోతం. సాయంత్రం కొడుకూ-కోడలు ఇంటికొచ్చేసరికి కాఫీ రెడీగుంచుతుంది.

"మా మంచి అమ్మ!" అంటాడు కొడుకు.

"మా అత్తయ్య దేవత..." అంటుంది కోడలు.

కాని... తనకేమనిస్తుందో వాళ్ళకనవసరం. ఓ పనిమనిషినో, ఆయానో చూడమందోసారి- తన అవస్థను అప్రత్యక్షంగా వ్యక్తం చేస్తూ.

"ఎంత ఆయా అయినా పరాయిదే కదా! పిల్లల్ని బెదిరిస్తుందే కాని ప్రేమగా లాలించదత్తయ్యా!" అంది కోడలు. కొడుకు నోరు విప్పలేదు. 'పోనీ కూతురన్నా...' అదీ అంతే.

ఇప్పటివరకు కోడలి కాన్పులు, కూతురు కాన్పులు... వారి ఉద్యోగాలు, ఇప్పుడు వారి సరదాలు, రేపు మనవలూ, మనవరాళ్ళ చదువులూ, ఉద్యోగాలూ, పెళ్ళిల్లూ... సంసారాలు.

ఇక తనాశించిన శేష జీవితం గగన కుసుమమేనా? ఈ సంగతి కొడుకుతో ప్రస్తావించాలనుకుంటే... గొంతులో పచ్చివెలక్కాయ ఇరికినట్టనిపిస్తుంది. మాట పెగలదు. నోటికి తాళం పడుతుంది. కాని... తాళం విప్పాలి... తప్పదు. భర్త గ్రాట్యుటీ, పి.ఎఫ్. సొమ్ము తన వద్దే వుంది.

కామేశం అన్నయ్య ఎన్నో ఉత్తరాలు రాశాడు. 'నువ్వొస్తే మీ వదినా, నువ్వూ, నేనూ.. ముగ్గురం తీర్థయాత్రలకెల్దాం' అని. ఏమిటో రాను రాను జీవితం... పంజరంలో చిలకలాగైంది.

కొడుకూ కోడలు ఆఫీసు నుంచి రాగానే,

"కామేశం మామయ్య ఉత్తరం రాశాడురా! మావయ్యా, అత్తయ్యా తీర్థయాత్రలకెల్తున్నారట. నాకూ టికెట్ బుక్ చేయించారట.., రేపే వెళ్ళాలి..." అంది కాఫీ అందిస్తూ.

"ఐతే మీరు వెల్తారా...?" వసంత నెత్తి మీద పిడుగు పడింది.

"మావయ్యలాగే రాస్తాడు. మా అమ్మ మనల్నీ, మనవలూ, మనవరాళ్ళనొదలి ఎక్కడికీ పోదు..." అప్పుడే వచ్చిన వాసంతి కొట్టిపారేసింది- రాని నవ్వును పులుముకొని.

"మా అమ్మకు మనకంటే ఆత్మీయులింకెవరున్నారని వెల్తుంది?" నవ్వబోయాడు కొడుకు. ఇహ లాభం లేదనుకుని-

"ఉన్నార్రా...! కాశీ విశ్వనాథుడు... అయోధ్యా శ్రీరాముడు... ఇంకెందరో...!" నిర్ణయాత్మకంగా అంది భారతమ్మ.

కోడలూ, కూతురూ మొహాల మీద క్రమ్ముతున్న ముచ్చెమటల్ని గమనించినా... తన నిర్ణయం మార్చుకోదలచుకోలేదావిడ. తృప్తిగా ఊపిరి పీల్చుకుంది.

◆


తదుపరి సీరియల్

ఉపద్రష్ట శాయి